క్లుప్తంగా

నేడు నగరపాలక సంస్థలో 'స్పందన'

నెహ్రూనగర్: స్థానిక సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించే స్పందన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. ప్రతి రోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు సచివాలయాల్లోనూ స్పందన ఉంటుందని, స్థానికంగా పరిష్కారం కాని సమస్యలపై నేరుగా తమకు ఫిర్యాదు చేయవచ్చని ఆమె సూచించారు.

గిడుగు పురస్కారానికి డాక్టర్ రమణ యశస్వి ఎంపిక



గుంటూరు ఈస్ట్: గిడుగు పురస్కారానికి గుంటూరు వైద్య కళాశాలలో ఆర్థోవిభాగాధిపతి డాక్టర్ రమణ యశస్వి ఎంపికయ్యారు. అనేక రచనలతో పాటు న్యూమరిక్కులు అనే కొత్త కవితా ప్రక్రియకు ఆయన రూపకల్పన చేయడంతో గిడుగు పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ మేరకు అధికార భాషా సంఘ అధ్యక్షుడు విజయబాబు ప్రకటించారని డాక్టర్ రమణ యశస్వి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికార భాషా దినంగా ఏటా నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా డాక్టర్ యశస్విని అధికార భాష సంఘ సభ్యుడు డాక్టర్ కత్తి వెంకటేశ్వర్లు అభినందించారు.

అన్నదానం పుణ్యకారం



నెహ్రూనగర్: భక్తులకు అన్నదానం చేయడం ఎంతో పుణ్యకార్యమని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు, ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ తెలిపారు. నగరంలోని చుట్టుగుంట పోలేరమ్మ తల్లి దేవస్థానంలో కొలుపులు సందర్భంగా నిర్వహిస్తున్న అన్నదానంలో ఆదివారం పాల్గొని, భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలో చుట్టుగుంట పోలేరమ్మ దేవస్థానం ఎంతో ప్రఖ్యాతిగాంచిందని తెలిపారు. దేవస్థానంలో ఎన్నో సంవత్సరాల నుంచి కొలుపులు, పొంగళ్లు నిర్వహిస్తున్నారన్నారు. దీనిలో భాగంగానే భక్తులకు అన్నదానం చేయడం అభినందనీయమని కొనియాడారు. భక్తుల ఆహ్లాదం కోసం దేవస్థానం వద్ద గల చెరువు ట్రాక్‌ను ఆధునీకరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు అడకా పద్మావతి, వైఎస్సార్ సీపీ నాయకుడు సాధు రాజేష్ పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో ప్రైవేటు ల్యాబ్ సిబ్బంది కనిపిస్తే కేసులు

గుంటూరు మెడికల్: జీజీహెచ్‌లో ప్రైవేటు ల్యాబ్‌ల సిబ్బంది టెస్ట్‌లు చేసేందుకు తిరిగినట్లు కనిపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ హెచ్చరించారు. ప్రైవేటు ల్యాబ్‌ల సిబ్బంది జీజీహెచ్‌లో కనిపిస్తే పోలీసు కేసులు పెడతామని వార్నింగ్ ఇచ్చారు. ప్రైవేటు ల్యాబ్‌ల వారిని జీజీహెచ్ సిబ్బంది ప్రోత్సహిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. ఆదివారం ఆస్పత్రిలో ఆయన ఆకస్మిక తనిఖీలు చేశారు. ప్రైవేటు ల్యాబ్‌ల వారు టెస్ట్‌ల కోసం వస్తున్నట్లు రోగుల నుంచి ఫిర్యాదులు రావడంతో ఆయన వార్డులో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని పరీక్షలు ఆస్పత్రిలోనే చేసేలా చర్యలు తీసుకున్నా బయట వారు ఎందుకు వస్తున్నారని ప్రశ్నించారు. బయటి ల్యాబ్‌ల వారు వార్డులోకి వస్తే విధుల్లో ఉండే ఆస్పత్రి సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని గట్టిగా హెచ్చరికలు జారీ చేశారు.

పార్టీ గెలుపునకు ప్రతిఒక్కరూ కృషి చేయాలి

పెదనందిపాడు: అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని మండల మాజీ కన్వీనర్, కమ్మ కార్పొరేషన్ సంస్థ రాష్ట్ర డైరెక్టర్ మదమంచి వాసు కోరారు. అన్నపర్రులోని శివాలయం కల్యాణ మండపంలో ఆదివారం మధ్యాహ్నం జరిగిన పార్టీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో విజయం దిశగా పార్టీ కార్యాచరణ రూపొందించిందని, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరలా ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పార్టీ కోసం కష్టపడేవాళ్లందరికీ గుర్తింపు ఉంటుందని, ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గమనించాలని ఆయన సూచించారు. ఎన్ని సమస్యలు ఎదురైనా వైఎస్సార్ సీపీ గెలుపు కోసం కృషి చేయాలని చెప్పారు. సమావేశంలో జిల్లా సర్పంచుల సంఘం ఉపాధ్యక్షుడు కమ్మ నాగమల్లేశ్వరరావు, సర్పంచులు ఎ.శ్రీనివాసరావు, రావిపాటి కృష్ణప్రసాద్, పి. శ్రీలక్ష్మి, ఎంపీటీసీలు చెల్లి లక్ష్మి, కల్లూరి నాగు, సయింపు శ్రీనివాసరావు, పార్టీ నాయకులు గేరా రత్తయ్య, పాటిబండ్ల రాంబాబు, జాగర్లమూడి లక్ష్మీనారాయణ, లావు రామ్మోహనరావు, మాదిసేని నాగేశ్వరరావు, నాగిశెట్టి సుబ్బారావు, కాపు శ్రీనివాసరావు, కట్టా శ్రీధర్, కె.గోపిరాజ్, జి.సింగయ్య, పి.పాపారావు, కె.భూషణ్ పాల్గొన్నారు.

లేఅవుట్లలో సదుపాయాల కల్పన వేగవంతం

అధికారులకు మేయర్ కావటి ఆదేశం



ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడుతున్న మేయర్ కావటి

నెహ్రూనగర్: జగనన్న లే అవుట్లలో తాగునీరు, రోడ్లు, విద్యుత్ స్తంభాలు తదితర మౌలిక సదుపాయాల కల్పన వేగవంతం చేయాలని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు ఇంజినీరింగ్ అధికారుల్ని ఆదేశించారు. తన చాంబర్‌లో అనంతవరప్పాడు, కొర్నెపాడు లే అవుట్లలో మౌలిక సదుపాయాల కల్పనపై ఇంజినీరింగ్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ముందుగా ఆయన లే అవుట్స్ మ్యాప్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ లే అవుట్స్‌లో మౌలిక సదుపాయాల కల్పన త్వరితగతిన పూర్తి చేసినప్పుడే లబ్ధిదారులు ఇంటి నిర్మాణం చేసుకోవడానికి ఆసక్తి చూపుతారని తెలిపారు. ప్రతి ఒక్కరికీ సొంత ఇళ్లు ఉండాలనే బృహత్ ఆశయంతో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పేద ప్రజలకు ఇంటి స్థలాల్ని మంజూరు చేసిందని చెప్పారు. లే అవుట్లలో మౌలిక సదుపాయాల్ని కల్పించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని పేర్కొన్నారు. లబ్ధిదారులు కూడా అశ్రద్ధ చేయకుండా ఇళ్లను నిర్మించుకోవాలని, స్థలాలకు మంచి డిమాండ్ వస్తుందని మేయర్ సూచించారు. సచివాలయ కార్యదర్శులు కూడా తమ పరిధిలో వలంటీర్లతో కలసి లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణాలపై అవగాహన కల్పించాలని చెప్పారు. సమావేశంలో నగరపాలక సంస్థ ఎస్ఈ భాస్కర్, ఈఈలు కోటేశ్వరరావు, కొండారెడ్డి, డీఈఈలు, ఏఈలు పాల్గొన్నారు.

మిత్రమా.. కుశలమా !



గురువుల సత్కారంలో 1998-99 బ్యాచ్ విద్యార్థులు

నగరంపాలెం: ఏటీ అగ్రహారం ఎస్‌కేబీఎం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సందడి నెలకొంది. 1998-99లో టెన్త్ చదివిన వారంతా అనాటి స్మృతుల్ని నెమరువేసుకున్నారు. అప్పట్లో పాఠశాలకు విద్యార్థులుగా వచ్చిన వారు.. ప్రస్తుతం వారి కుటుంబ సభ్యులతో కలసి వచ్చి ఆప్యాయంగా మాట్లాడుకున్నారు. తరగతి గదుల్లో చేసిన అల్లర్లు, స్నేహితుల్ని పిలుచుకున్న అల్లరి పేర్లను గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం ఏయే వృత్తుల్లో ఎక్కడెక్కడ స్థిరపడ్డారు.. కుటుంబ సభ్యుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రోజంతా ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. అనంతరం అప్పటి గురువుల్ని ఘనంగా సత్కరించారు. పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు కదిరి సంజీవరావు, షేక్ షాజహాన్, పరసా ఆంజనేయులు, బి.నాగరాజు, షేక్ నజీర్, హైదరాబాద్, చెన్నై, వైజాగ్, గుంటూరుతో పాటు వివిధ చోట్ల నుంచి పూర్వ విద్యార్థులు రావడంతో పాఠశాలలో సందడి వాతావరణం నెలకొంది.

బలవంతపు వసూళ్లు చేస్తున్న మహిళల అరెస్టు



పట్నంబజారు: మన ప్రాంతం వాళ్లు కాదు... చూడగానే అర్థమైపోతుంది.. నలుగురైదుగురు కలసికట్టుగా వాహనాల్ని నిలిపి వేస్తున్నారు.. పిచ్చి రాతలు రాసిన కాగితాలను చూపించి డబ్బులు డిమాండ్ చేస్తున్నారు.. ఇవ్వకుంటే నేరుగా జేబుల్లో నుండి లాక్కుంటున్న పరిస్థితులు.. విషయం తెలుసుకున్న పోలీసులు రంగప్రవేశం చేసి ఆఖరిని వారిపై కేసులు నమోదు చేశారు. కొత్తపేట, పాత గుంటూరు పోలీసుస్టేషన్ల సీఐలు షేక్ అన్వర్ బాషా, ఎం.వి. సుబ్బారావు తెలిపిన వివరాల ప్రకారం... రాజస్థాన్ రాష్ట్రంలోని పాలి జిల్లా సోజత్ రోడ్ నుంచి 13 మంది మహిళలు ఏడుగురు పసిపిల్లలతో కలసి రెండు రోజుల కిందట విజయవాడకు వచ్చారు. మ్యాజిక్ పుస్తకాలు అమ్ముతున్నామని చెప్పి, రోడ్డు మీద పోయే వారి ఆపి, తమ ఊరి వారు ఎంతో ఇబ్బందుల్లో ఉన్నారని చెప్పి డబ్బులు వసూలు చేస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం గుంటూరుకు చేరుకుని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న మల్లేశ్వర డార్మెటరీలో రూముల్ని అద్దెకు తీసుకున్నారు. రోడ్లపైకి వచ్చి ఇబ్బందులకు గురి చేస్తున్న నేపథ్యంలో సమాచారం అందుకున్న పోలీసులు వారందరిని అదుపులోకి తీసుకున్నారు. బలవంతంగా డబ్బులు వసూలు చేయడంపై కేసు నమోదు చేసి, అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరస్తున్నట్లు తెలిపారు. ఇటువంటి బలవంతపు వసూళ్లు ఉంటే పోలీసులకు సమాచారం అందించాలని సీఐలు అన్వర్ బాషా, ఎం.వి. సుబ్బారావు తెలిపారు.

పోటీల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినుల ప్రతిభ



చేబ్రోలు: గిడుగు రామ్మూర్తి పంతులు 160వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని తెలుగు భాషా మాధుర్యం అంశంపై గుంటూరు ప్రభుత్వ మహిళా కళాశాలలో శనివారం జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించారు. చేబ్రోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన కె. సృజిని, పి. దుర్గాభవాని వ్యాస రచన, సామెతల వివరణ పోటీల్లో ప్రతిభ చూపారు. జిల్లా కలెక్టరు ఎం.వేణుగోపాలరెడ్డి తదితరుల చేతుల మీదుగా బహుమతులను అందుకున్నారు. విద్యార్థినుల్ని ప్రిన్సిపాల్ వి. శ్రీదేవి, కళాశాల అధ్యాపకులు అభినందించారు.

చంద్రబాబుపై పోలీసులకు ఫిర్యాదు

తెనాలి టౌన్: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు, రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెంనాయుడు, నారాలోకేష్‌పై తెనాలి రూరల్ పోలీస్ స్టేషన్‌లో వైఎస్సార్ సీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని, ప్రజలకు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని, వారిపై తగు చర్యలు తీసుకోవాలని రూరల్ ఏఎస్ఐ హైమారావుకు ఆదివారం ఫిర్యాదు చేశారు. పార్టీ నాయకులు సంకురు బుజ్జిబాబు, ఎల్.చినబాబు, చుండూరు గోపి, ఆదం షఫీ ఉన్నారు.

పెరిగిపోతున్న ఎన్‌సీడీ వ్యాధులతో ముప్పు

- ప్రాథమిక దశలోనే గుర్తించేలా ఆధునిక వైద్యసేవలు
- లలితా గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ విజయ



మాట్లాడుతున్న డాక్టర్ విజయ, పక్కన డాక్టర్ అనురాగ్, డాక్టర్ స్రవంతి

గుంటూరు మెడికల్: ఆధునిక జీవనశైలి వల్ల నేడు బీపీ, షుగర్, గుండెజబ్బులు, క్యాన్సర్ జబ్బులు, ఊపిరితిత్తుల జబ్బులు లాంటి నాన్ కమ్యూనకబుల్ డీసీజెస్(ఎన్‌సీడీ) బాగా పెరిగిపోతున్నాయని లలితా గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పమిడిముక్కల విజయ అన్నారు. అత్యాధునిక వైద్య సౌకర్యాలతో ఎన్‌సీడీ వ్యాధుల్ని ముందస్తుగానే గుర్తించి చికిత్స చేయడం ద్వారా పూర్తిగా కట్టడి చేయవచ్చని చెప్పారు. గుంటూరు ప్రజలకు ఆధునిక వైద్య సేవల్ని చేరువ చేయాలనే లక్ష్యంతో తాము నూతనంగా అడ్వాన్స్‌డ్ కార్డియో వాస్క్యులర్ క్లినిక్‌ను, ఆరియా క్యాన్సర్ సెంటర్‌ను నూతనంగా ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఆదివారం గుంటూరు కొత్తపేటలో నూతనంగా రెండు క్లినిక్‌లను సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ పి.వి. రాఘవ శర్మతో కలసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయ మీడియాతో మాట్లాడారు. ప్రాణాల్ని హరించే గుండె జబ్బుల్ని ముందస్తుగానే గుర్తించి చికిత్స అందించే అత్యాధునిక వైద్య సౌకర్యాల్ని తాము అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. ఇంట్రవెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ అనురాగ్ పోలవరపు మాట్లాడుతూ గుండె రక్తనాళాలే కాకుండా బ్రెయిన్, కిడ్నీ, ప్రేగులు, ఇతర శరీర అవయవాల్లోనూ మూసుకుపోయి పలురకాల వ్యాధులు వస్తున్నాయని చెప్పారు. శరీర భాగాల్లోని రక్తనాళాలు మూసుకుపోవడంతో ముందస్తుగా నొప్పి వస్తుందని, తదుపరి ఇతర సమస్యలు వస్తాయన్నారు. వీటిని ప్రాథమిక దశలోనే గుర్తించే ఆధునిక వైద్యం నేడు అందుబాటులోకి తెచ్చామని వివరించారు. మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ బైరపనేని స్రవంతి మాట్లాడుతూ ఆధునిక జీవనశైలి వల్ల నేడు క్యాన్సర్లు బాగా పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా మహిళల్లో రొమ్ము, గర్భాశయ ముఖద్వారం, ఇతరుల్లో ఊపిరితిత్తులు, నెక్ అండ్ హెడ్ క్యాన్సర్‌లు వస్తున్నాయని తెలిపారు. తొలిదశలోనే గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చన్నారు. అన్ని రకాల క్యాన్సర్లను ప్రాథమిక దశలోనే గుర్తించే ఆధునిక వైద్య సౌకర్యాల్ని తాము అందుబాటులోకి తెచ్చామని వెల్లడించారు. ప్రతి ఒక్కరూ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవడం ద్వారా క్యాన్సర్ల బారిన పడకుండా రక్షించుకోవచ్చని తెలిపారు. పలువురు సీనియర్ వైద్యులు ప్రారంభోత్సవంలో పాల్గొని డాక్టర్ రాఘవశర్మ, డాక్టర్ విజయ దంపతులకు అభినందనలు తెలిపారు.

మానస హాస్పిటల్‌లో 80 మందికి వైద్య పరీక్షలు



రోగిని పరీక్షిస్తున్న డాక్టర్ నరసింహారావు

గుంటూరు మెడికల్: ఆంధ్రప్రదేశ్ మానసిక వైద్యుల సంఘం, మానస స్కిజోఫ్రెనీయా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక కొత్తపేటలోని మానస హాస్పిటల్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. స్కిజోఫ్రెనీయా లక్షణాలు తొలి దశలోనే గుర్తించి క్రమం తప్పకుండా మందులు వాడటం ద్వారా వ్యాధికి గురైనవారు విధుల్ని చక్కగా నిర్వహించుకోవచ్చని ఆంధ్రప్రదేశ్ మానసిక వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఐ.వి.ఎల్. నరసింహారావు చెప్పారు. ప్రతినెలా నాలుగో ఆదివారం తమ ఆస్పత్రిలో ఉచిత మానసిక వైద్యశిబిరం నిర్వహిస్తున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. సుమారు 80 మందికి డాక్టర్ ఐ.వి.ఎల్. నరసింహారావు, డాక్టర్ ఇవటూరి శరత్‌చంద్ర ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు కూడా అందజేశారు.

ఇళ్లలో చోరీల కేసుల్లో ఆరుగురు నిందితుల అరెస్టు



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న వస్తువులతో ఎస్‌హెచ్‌వో హైమారావు

గుంటూరు ఈస్ట్: ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న ఆరుగురు నిందితుల్ని నగరంపాలెం పోలీసులు అరెస్టు చేశారు. పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్‌హెచ్‌వో హైమారావు వివరాలు వెల్లడించారు. స్టేషన్ పరిధిలో వరుసగా మూడు చోరీలపై కేసులు నమోదయ్యాయన్నారు. దర్యాప్తులో కేవీపీ కాలనీకి చెందిన ఎం.దావీదు, షేక్ జాఫర్ సాదిక్, రాకడి కుమార్, బోతపాటి జగన్, ఎల్ఆర్ కాలనీకి చెందిన రెడ్డి జెమినీరాం, బలుసుపాటి విజయ్‌దుర్గను ఆదివారం అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి నల్లపూసల గొలుసు, బంగారు నెక్లెసు, ఉంగరం, నాలుగు సెల్‌ఫోన్లు, రెండు కెమెరాలు, రూ. 2వేలతో పాటు పలు గృహోపకరణాలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితుల్ని కోర్టులో హాజరుపరిచి రిమాండుకు తరలించినట్లు పేర్కొన్నారు.

రవి నాయక్‌కు డాక్టరేట్



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ పరిశోధకుడు ఆర్. రవి నాయక్‌కు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసిందని రీసెర్చ్ సెల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పి. కిరణ్మయి తెలిపారు. ఫార్మాస్యూటికల్ సైన్సెస్ పరిశోధన పర్యవేక్షకులు డాక్టర్ అంజనా మాలే పర్యవేక్షణలో 'ఐసోలేషన్, కేరెక్టరైజేషన్, ఫార్ములేషన్ అండ్ ఎవల్యూషన్ ఆఫ్ ట్యూమరోన్ ఫైటోజోమ్స్ ఫ్రమ్ కరుకుమా స్పీసీస్ ఇన్ ద ట్రీట్‌మెంట్ ఆఫ్ కొలోన్ కేన్సర్' అనే అంశంపై పరిశోధన గ్రంథం సమర్పించినందుకు గాను డాక్టరేట్ ప్రదానం చేసినట్లు పేర్కొన్నారు.

హెల్పింగ్ సోల్జర్స్ ట్రస్టు ఫౌండర్ జబీవుల్లాకు పురస్కారం



పెదకాకాని: అఖిల భారత ఎన్‌జీవోస్ సంక్షేమ సంఘం, కేబీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గుంటూరు ఏసీ కళాశాలలో ఆదివారం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సంఘాలు, ట్రస్టులను ప్రోత్సహిస్తూ పురస్కారాలు అందజేశారు. పెదకాకాని మండలానికి చెందిన హెల్పింగ్ సోల్జర్స్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ షేక్ జబీవుల్లా ఫరూఖ్‌కు జాతీయ సేవా రత్న పురస్కారం అందజేసి, సత్కరించారు. కార్యక్రమానికి కేబీఆర్ ఫౌండేషన్ చైర్మన్ కడవకంటి బాలరాజు అధ్యక్షత వహించారు. హెల్పింగ్ సోల్జర్స్ చారిటబుల్ ట్రస్ట్ సేవల్ని పలువురు ప్రశంసించారు. కార్యక్రమంలో గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరి, నగర డెప్యూటీ మేయర్ షేక్ సజీల, కేబీఆర్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఉత్తమ సమాజ నిర్మాణానికి ఉపాధ్యాయులే కీలకం

ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి



ఎమ్మెల్సీ అప్పిరెడ్డిని కలిసిన ఉపాధ్యాయులు, అధ్యాపకులు

పట్నంబజారు: ఉత్తమ సమాజ నిర్మాణానికి ఉపాధ్యాయులే కీలకమని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి పేర్కొన్నారు. టీచర్స్ డే సందర్భంగా జిల్లా, రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులు, అధ్యాపకుల్ని గౌరవించాలని సమైక్య ప్రైవేట్ లెక్చరర్స్, టీచర్స్ ఆర్గనైజేషన్స్(ఎసీపీఎల్‌టీవో) సంకల్పించింది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు నేతృత్వంలో జ్యూరీ కమిటీని ఏర్పాటు చేసుకుని, నిష్పక్షపాతంగా ఉత్తమ గురువుల్ని ఎంపిక చేసి, సెప్టెంబర్ 3న గుంటూరు వేదికగా ఘనంగా సత్కరించనున్నారు. దానిలో భాగంగా ఆదివారం బృందావన్ గార్డెన్స్‌లోని ఎమ్మెల్సీ కార్యాయలంలో ఆర్గనైజషన్ ప్రతినిధులు ఎమ్మెల్సీ అప్పిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. సన్మాన మహోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని విన్నవించారు. ఎమ్మెల్సీ అప్పిరెడ్డి మాట్లాడుతూ సమాజంలో ఎవరికైనా గురువే ప్రత్యక్ష దైవమని పేర్కొన్నారు. మన పురాణాలు సైతం గురు బ్రహ్మ, గురు విష్ణు, గురుదేవో మహేశ్వరహ అని కీర్తించినట్లు చెప్పారు. మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన సమైక్య ప్రైవేట్ లెక్చరర్స్, టీచర్స్ ఆర్గనైజేషన్ ప్రతినిధుల్ని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఆర్గనైజేషన్‌వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పి.నాగయ్య, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.సురేష్, వర్కింగ్ వైస్ ప్రెసిడెంట్ డి.రమేష్, జాయింట్ సెక్రటరీ పి.ఆర్.రత్నకుమార్, కో-ఆర్డినేటర్ పి.శ్రీనివాసరెడ్డి, గుంటూరు అధ్యక్షుడు వి.చంద్రశేఖర్, కార్యదర్శి కె.కోటిరెడ్డి, కార్యవర్గ సభ్యులు సీహెచ్.ప్రసాద్, ఎం.మల్లేశ్వరరెడ్డి, ఎస్‌కే. జాని, సీహెచ్.మోహన బుజ్జి పాల్గొన్నారు.

కవులు భావితరాల భవిష్యత్తుకు బాటలు వేయాలి

డాక్టర్ రామరాజు శ్రీనివాసరావు



శేషాచారికి సత్కారం

పాత గుంటూరు: కవులు భావితరాల భవిష్యత్తుకు బాటలు వేయాలని రామరాజు ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ రామరాజు శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆదివారం బ్రాడీపేట ఎస్‌హెచ్‌వో సమావేశ మందిరంలో నవ్యాంధ్ర రచయితల సంఘం, బాపు-రమణ-బాలు కళాపీఠం సంయుక్త ఆధ్వర్యంలో కవి మిత్రుల సంగమం-కవి సమ్మేళనం నిర్వహించారు. సభకు రచయిత్రి సీహెచ్.సుశీలమ్మ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రామరాజు శ్రీనివాసరావు మాట్లాడుతూ కథ, కవిత, మరి ఏ ఇతర రచన అయినా సమాజ కల్యాణానికి, అణగారిన వర్గాల అభ్యున్నతికి ఉపయోగపడితేనే దానికి సార్థకత చేకూరుతుందని తెలిపారు. సాహిత్య సృజనలో రచయితలు, కవులు, తమ ప్రాంత అస్తిత్వాన్ని మరువకూడని చెప్పారు. అనంతరం ఎం.ఆర్.వి. సత్యనారాయణమూర్తి రచించిన 'మా పెనుగొండ కథలు' పుస్తకాన్ని రచయిత పెనుమాక నాగేశ్వరరావు సమీక్షించారు. గిడుగు వెంకట రామ్మూర్తి జయంతి పురస్కరించుకుని బి. జనార్దనరెడ్డి నిర్వహణలో నిర్వహించిన కవి సమ్మేళనంలో పలువురు కవులు కవితల్ని వినిపించారు. తెలుగు భాషా ప్రాశస్త్యం కవిత చదివిన మొరుమూరి శేషాచారికి ఉత్తమ కవితా బహుమతి అందించి సత్కరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కలిమిశ్రీ , పత్రికా ఎడిటర్ గోలి సీతారామయ్య, డాక్టర్ రమణ యశస్వీ, నిర్వాహకులు బండికల్లు జమదగ్ని, సయ్యద్ జానీ బాషా పర్యవేక్షించారు.

పుస్తకమే సామాజిక చైతన్యపు వారధి



బుక్ స్టాల్ ప్రారంభిస్తున్న విశ్రాంత అధికారులు సుబ్బారావు, రాజేశ్వరరావు తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: పుస్తకమే సామాజిక చైతన్య వారధి అని, రాజ్యాంగంపై పట్టు సాధించడం ద్వారా సామాజిక స్థితిగతుల్ని అధ్యయనం చేయవచ్చని విశ్రాంత ఐఏఎస్ ఆర్. సుబ్బారావు, విశ్రాంత ఐఆర్ఎస్ రాజేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం అరండల్‌పేట ఐదో లైనులో కుల నిర్మూలన కలయిక సంఘ (ఏసీఎఫ్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బుక్ స్టాల్‌ను ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మార్గదర్శకత్వాన్ని అందిపుచ్చుకున్న కాన్షీరామ్ బాటలో ప్రతి ఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు. అంబేడ్కర్ అందించిన రాజ్యాంగమనే ఆయుధాన్ని ధరించాలంటే, దానిపై పూర్తి అవగాహన ఉండాలని పేర్కొన్నారు. పుస్తకం జీవితానికి మార్గదర్శకమని, దాని ద్వారా సామాజిక చైతన్యం తీసుకురావచ్చని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ రెవెన్యూ ఉద్యోగుల అసోసియేస్ జిల్లా అధ్యక్షుడు దేవరాజ్ మాట్లాడుతూ ఏసీఎఫ్ ఆధ్వర్యంలో జరగబోయే రాజ్యాంగంపై అవగాహన పరీక్షకు అవసరమైన పుస్తకాలు బుక్ స్టాల్‌లో ఉంటాయని తెలిపారు. ఇకపై ప్రతి కార్యక్రమానికి పుస్తకం కానుకగా ఇచ్చే సంప్రదాయానికి నాంది పలుకుదామని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విద్యాధికారి పిల్లి రమేష్, విశ్రాంత డీఎస్పీ రవికుమార్, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఏజీ ఆఫీస్ సూపరింటెండెంట్ సుబ్బారావు, రిటైర్డ్ ఆర్ అండ్ బీ డీఈ సుధాకర్, ఎలక్ట్రికల్ డీఈ రాజమోహన్, సబ్ రిజిస్ట్రార్ చిట్టిబాబు, జై భీమ్ బాలకృష్ణ, ఏసీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మోజెస్, తలకాయల అశోక్, చుక్కా నాగభూషణం, రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గ్రామదేవతలకు పూజలు



విశేష అలంకరణలో గంగానమ్మ



శలపాడులో ప్రత్యేక అలంకారంలో దర్శనమిస్తున్న నాంచారమ్మ తల్లి

పెదకాకాని: శ్రావణ మాసం పురస్కరించుకుని మండలంలోని వెనిగండ్లలో గ్రామస్తులు ఆదివారం గ్రామ దేవతలు గంగానమ్మ, పోలేరమ్మ, మహాలక్ష్మమ్మలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం మేళతాళాలు, కనకతప్పెట్ల మధ్య పూజా సామగ్రితో ఆలయాలకు చేరుకున్నారు. ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని, పాడిపంటలు వృద్ధి చెందాలని కోరుతూ పూజలు చేశారు. సాయంత్రం ఉత్సవంగా బయలుదేరి గంగానమ్మ గుడికి చేరుకుని పొంగలి, నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులందరికీ ఆలయ కమిటీ పెద్దలు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఉత్సవాల సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

చేబ్రోలులో...

మండలంలోని మంచాలలో గ్రామ దేవత దేశాంబ అమ్మవారికి ఆదివారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంటలు సమృద్ధిగా పండాలని, గ్రామం సుఖ శాంతులతో ఉండాలని కోరుతూ గ్రామస్తులు శ్రావణ మాసంలో మూడు వారాల పాటు ప్రత్యేక పూజలు, పొంగళ్లు పొంగించి మొక్కులు తీర్చుకుంటారు. తొలుత మేళతాళాలతో ఊరేగింపుగా మహిళలు దేవాలయానికి చేరుకున్నారు. శ్రావణ మాసంలో నిర్వహించిన చివరి ఉత్సవం కావడంతో అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ప్రత్యేక అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు శిష్టా పూర్ణచంద్ర శ్రీనివాసమూర్తి, రావూరి శంకర శాస్త్రి విశేష పూజలు నిర్వహించారు. శలపాడులోగ్రామ దేవత నాంచారమ్మ తల్లి దేవాలయంలో, కొత్తరెడ్డిపాలెంలోని సీతాలమ్మ అమ్మవారికి ఆదివారం శ్రావణ మాస పూజలు వైభవంగా నిర్వహించారు.

ఆయుర్వేద వైద్యంతో దీర్ఘకాలిక రోగాలకు చెక్

గుంటూరు రూరల్: ఆయుర్వేద వైద్యంతో దీర్ఘకాలిక రోగాలను సులువుగా తగ్గించవచ్చని వైద్యుడు వైద్యనామాల శ్రీనివాసరావు పేర్కొన్నారు. నగర శివారులోని రెడ్డిపాలెంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ ఆయుర్వేద వైద్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. ఆయుర్వేద వైద్యంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు పలుచోట్ల శిబిరాలను నిర్వహిస్తున్నట్లు శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో ఆయుర్వేద వైద్యులు పోపూరి శిరీష, ఎం.రామారావు, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.